## అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు నేరం

కొల్చారం, అక్టోబర్ 15: అసైన్డ్ భూముల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం చట్టరీత్యా నేరమని, ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన ఇంటి స్థలాల్లో 75 గజాల వరకు నిర్మించిన నిర్మాణాలను జీవో 59 ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని యేనగండ్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని యేనగండ్ల పంచాయతీ దుంపలకుంట చౌరస్తాలో మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారి పక్కన సర్వే నెంబర్ 330లో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇళ్లు, వ్యాపార సముదాయాలకు ఆదివారం నోటీసులను అందజేశారు.

## సీఎం వ్యక్తిగత కార్యదర్శి రాజశేఖర్ రెడ్డికి మాతృవియోగం

రామాయంపేట, అక్టోబర్ 15: ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శి పెంటపర్తి రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తి పెంటపర్తి రత్నమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో ఆదివారం మృతి చెందారు. రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామానికి చెందిన పెంటపర్తి రత్నమ్మ (80) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రత్నమ్మ అంత్యక్రియలను స్వగ్రామం డి.ధర్మారంలో సోమవారం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాపన్నపేట, అక్టోబర్ 15: మండలంలోని తమ్మాయిపల్లి గ్రామానికి చెందిన గజం మల్లమ్మ శనివారం చనిపోయింది. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సౌజన్యంతో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో అరికెల ఉప సర్పంచ్ అనిల్ రెడ్డి, తమ్మాయిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, పాపన్నపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామిరెడ్డి, వార్డు సభ్యులు సాయిలు, శ్రీశైలం, వడ్ల అశోక్, శ్రీనివాస్, గొల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సమరానికి సై

- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- రేపటినుంచి ప్రచారంలో దూసుకెళ్లనున్న 'కారు'
- మెదక్ నియోజకవర్గంలో ఏర్పాట్లు సిద్ధం
- ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా ప్రచారం
- బీఆర్ఎస్‌కు అనుకూలంగా తీర్మానాలు

మెదక్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమయ్యారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో వారు ప్రచార రంగంలోకి దిగేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి బీ ఫాం అందుకున్నారు. బీ ఫాంతోపాటు మేనిఫెస్టోతో రానున్న మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఇక ప్రచారంతో ప్రజల్లోకి దూసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఇక నేరుగా ఓట్లు అడిగేందుకు ప్రజల దగ్గరకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్థానిక ముఖ్య నేతలతో సమావేశమై ప్రచార విషయమై చర్చిస్తున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నేతృత్వంలో అసంతృప్తి నేతలను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక సోమవారం నుంచి మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారం ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. మెదక్, రామాయంపేట మండలాల్లో ఇప్పటికే మంత్రి హరీశ్‌రావు ఒక దఫా మీటింగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

### ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా ప్రచారం

ఆదివారం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా ప్రచారం చేయనున్నారు. మేనిఫెస్టోలో ఉన్న ప్రతి పథకాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆసరా పెన్షన్ రూ.2,016 నుంచి రూ.5,016కు పెంచనున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం రూ.3016 చేసి 5 సంవత్సరాల్లో రూ.5016 చేస్తామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ కేసీఆర్ బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా కల్పించనున్నారు. అంతేకాదు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ. 4,016 నుంచి రూ.6,016కు పెంచనున్నారు. అలాగే రైతు బంధు పథకం ఎకరానికి రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచారు. అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3వేలు అందించనున్నారు. ఇలా ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారం చేయనున్నారు.



### అభివృద్ధి సాధించాం

మెదక్ నియోజకవర్గంలో ఎప్పుడు జరగని అభివృద్ధి సాధించాం. నిధుల వరద పారించాం. చేసిన పనినే ప్రజల ముందుంచుతాం. ఆదివారం బీ ఫాం తీసుకున్న తర్వాత సోమవారం నుంచి మెదక్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తాం. ఇప్పటికే మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాం. గ్రామ స్థాయిలోకి వెళ్లి ప్రజలను ఓట్లు అడుగుతాం. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించింది. అందుకే ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో బ్రహ్మాండంగా ఉంది.

– పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి



పెద్దశంకరంపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న సర్పంచ్

## బాలత్రిపుర సుందరీదేవిగా దుర్గామాత

పెద్దశంకరంపేట/చిలిపిచెడ్/రామాయంపేట/వెల్దుర్తి/ కొల్చారం, అక్టోబర్ 15: మండలంలోని గ్రామాలతోపాటు పట్టణంలోని పలు మండపాల వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం పట్టణంలోని రాణి శంకరమ్మ గడి కోటతో పాటు తిర్మలాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, శ్రీరామ సేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పేట మండలంలో ప్రతిష్ఠించిన అమ్మవార్ల మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

☛ చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా నది తీరాన వెలిసిన చాముండేశ్వరీ దేవీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

☛ రామాయంపేట పట్టణంలోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపురా సుందరీదేవీగా పూలతో భక్తులు అలంకరించారు. ఆదివారం అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు పొండురంగాచారి-వరలక్ష్మిలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజు యాదవ్, చింతల రాములు, మర్కు దత్తు, ఆలయ పూజారి నాగరాజుచారి, సిబ్బంది పాల్గొన్నారు.

☛ విజయదశమిని పురస్కరించుకొని దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలో ఆదివారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్, మానేపల్లి, మాసాయిపేట, ఉప్పులింగాపూర్ గ్రామాల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

☛ కొల్చారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు బాల త్రిపురా సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. పైతరలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహానికి బీఆర్ఎస్ యువ నాయకులు దివ్య, రవితేజ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరిగుంతంలో జడ్పీటీసీ మేఘమాల, సంతోశ్‌కుమార్ పూజలు నిర్వహించారు.



పెద్దశంకరంపేటలో స్వీట్లు పంచుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు



అల్లాదుర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



రేగోడ్‌లో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

# మేనిఫెస్టోతో సబ్బండ వర్గాలకు న్యాయం

- మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ అర్బన్/మెదక్ రూరల్/పెద్దశంకరంపేట/అల్లాదుర్గం/చిన్నశంకరంపేట/, అక్టోబర్15: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయడంతో జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద ఆదివారం మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగించే మేనిఫెస్టోను విడుదల చేశారని, సబ్బండ వర్గాలకు ఈ మేనిఫెస్టోతో న్యాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్ నర్స లక్ష్మీనారాయణగౌడ్, జయరాజ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

☛ నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బీ ఫాం అందుకోవడంతో పాటు సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించడంతో ఆదివారం పెద్దశంకరంపేటలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంచుకొని బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

☛ అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించడం, మెదక్ నుంచి ఎమ్మెల్యేగా పద్మా దేవేందర్‌రెడ్డికి బీ ఫాం అంద జేయడంతో ఆదివారం మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో సంబురాలు జరుపుకున్నారు.



చిన్న శంకరంపేటలో టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

☛ సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా అల్లాదుర్గంలో బీఆర్ఎస్ పార్టీశ్రేణులు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాశీనాథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అంజియాదవ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దశరథ్ పాల్గొన్నారు.

☛ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా ఆదివారం రేగోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎంపీటీసీ నర్సింలు పాల్గొన్నారు.

☛ ప్రజల సంక్షేమ మేనిఫెస్టోను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో మండల పార్టీ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం టేక్మాల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు నిర్వహించి బాణాసంచ కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, మండల ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా యువత అధ్యక్షుడు భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

☛ సీఎం కేసీఆర్ సకల జనుల సంక్షేమ కోసం బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించడంతో ఆదివారం చిన్నశంకరంపేటలో పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల రైతు బంధు అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పట్లూరి రాజు, ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ యాదగిరి, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, దయానంద్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అంజిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ హేమ శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

రామాయంపేట, అక్టోబర్ 15: చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా శిక్షించక తప్పదని రామాయంపేట ఎక్సైజ్ ఎస్సై విజయసిద్ధార్థ అన్నారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని మెదక్ చౌరస్తా అక్కన్నపేట బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలను చేపట్టారు. అనంతరం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల నియామవళి అమలు ఉందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. వాహనంలో ఏదైనా వస్తువులు తరలించే ముందు వాటికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకుని రావాలన్నారు. లేకుంటే వాహనంతోపాటు వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సూచించారు. వాహన తనిఖీల్లో రామాయంపేట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

## యువకుడి ఆత్మహత్య

రామాయంపేట, అక్టోబర్ 15: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామంలోని రైలుపట్టాల మీద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన టంటం అనిల్‌కుమార్(22) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. గత రాత్రి ఫుల్లుగా మద్యం తాగి ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో మద్యం మత్తులోనే గ్రామ శివారులోని రైలుపట్టాల వద్ద వేగంగా వస్తున్న రైలు కిందపడి మృతిచెందాడని తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు ఎవ్వరూ లేరు. దీంతో గ్రామస్తుల వివరాలతో కామారెడ్డి రైల్వే పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీవీ రాజు కలలను సాకారం చేయాలి

నర్సాపూర్, అక్టోబర్15: పద్మవిభూషన్ డా.బీవీ రాజు 103వ జయంతి వేడుకలు నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్‌టీ కళాశాలలో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా బీవీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీవీ రాజు ఆశయాలను, కలలను సాకారం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన, డాంగోరియా దవాఖాన, వృద్ధాశ్రమంలలో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, డీజీఎం, మేనేజర్ పాల్గొన్నారు.